ప్రజాశక్తి

శుక్రవారం 28 జూలై 2023

5



శ్రీకాకుళం

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

- 'పది'లో 57.90శాతం ఉత్తీర్ణత
- ఇంటర్‌లో 45.91 శాతం

శ్రీకాకుళం అర్బన్ : ఎపి ఓపెన్ స్కూల్ అధ్వర్యాన జూన్, జూలైలో నిర్వహించిన పది, ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. పదో తరగతి పరీక్షకు 620 మంది హాజరు కాగా 359 మంది (57.90 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షలకు 965 మంది హాజరు కాగా 443 మంది (45.91 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్ కోసం ఈనెల 27 నుంచి ఆగస్టు నాలుగో తేదీ వరకు A.P.T.ONLINEలో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.జ్యోతికుమారి తెలిపారు. పరీక్ష ఫలితాల మార్కుల మెమోలను www.apopenschool.ap.gov.inలో పొందుపరిచినట్లు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఈనెల 26 నుంచి ఆగస్టు 31 వరకు అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జీడి 'మద్దతు'కు మరో పోరు

- కాశీబుగ్గలో నేడు 24 గంటల సత్యాగ్రహ దీక్ష
- గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టిన జీడిరైతు సంఘం
- సమాయత్తమవుతున్న రైతులు

జీడిపిక్కల మద్దతు ధర కోసం రైతులు పట్టు వదలకుండా పోరాడుతున్నారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్న డిమాండ్లతో మూడు నెలలుగా పలురూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈనెల 18వ తేదీన కాశీబుగ్గలో మహాధర్నా నిర్వహించి ప్రభుత్వంలో కదలిక తెప్పించడంలో కొంత విజయం సాధించగలిగారు. రైతులు, వ్యాపారులతో మంత్రి సీదిరి అప్పలరాజు సమావేశం నిర్వహించినా, రైతులకు మేలు కలిగే అంశమేదీ లేకపోవడంతో వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉదాసీనం, వ్యాపారుల మోసం, మంత్రి అప్పలరాజు వంచనతో న్యాయం జరగని రైతులు కాశీబుగ్గ సంత మైదానంలో 24 గంటల సత్యాగ్రహ దీక్షకు సమాయత్తమవుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో జీడి రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో, ఇళ్లలోనే దాచుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంట అమ్మితే తక్కువ ధరకే ఇచ్చేయాల్సి ఉంటోంది. అమ్మకుండా నిల్వ ఉంచితే వర్షాలకు పిక్కలు పోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఏం చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా జీడి సాగు ఉందని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. సాధారణంగా ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి వస్తుందని అధికారుల అంచనాగా ఉంది. ఉద్దానం ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వ్యాపారులు జీడి పంట కొనుగోళ్లు ప్రారంభించారు. ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండడంతో క్రమేణా ధర తగ్గిస్తూ రూ.8 వేలు వరకు ఇచ్చారు.

పప్పుకు రేటు... రైతులకు పోటు

పలాస జీడిపప్పుకు మంచి రేటు ఉన్నా, ముడి సరుకుకు ధర రాకపోవడంపై రైతులకు అంతుచిక్కడం లేదు. 80 కేజీల జీడి పిక్కలను ప్రాసెస్ చేయిస్తే 25 కేజీల పప్పు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పప్పు రూ.700 పలుకుతోంది. ఈలెక్కన 25 కేజీలకు రూ.17,500 వస్తుంది. దీంతోపాటు 65 కేజీల జీడి తొక్కు వస్తుంది. కేజీ రూ.15కు అమ్మినా రూ.975 వస్తుంది. మొత్తం కలిపి రూ.18,475 వరకు వస్తోంది. ప్రాసెసింగ్, కూలీల ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, వ్యాపార లాభం అన్నీ కలిపి రూ.రెండు వేలు మినహాయిస్తే రూ.16,475 మిగులుతోంది. రైతులు ప్రస్తుతం రూ.16 వేలు అడగడం సమంజసమే అన్న అభిప్రాయం అంతటా వినిపిస్తోంది.



సత్యాగ్రహ దీక్షా శిబిరం

మూడేళ్లుగా మోసమే

జీడిపిక్కల కొనుగోళ్లు, మద్దతు ధర విషయంలో మంత్రి అప్పలరాజు మూడేళ్లుగా రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. 2020లో వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించి 80 కేజీల బస్తాకు రూ.10 వేలుగా ప్రకటించారు. అందులో ప్రభుత్వం తరుపున రూ.వెయ్యి చెల్లిస్తామని హామీనిచ్చారు. ఇప్పటివరకు ఆ డబ్బులు ఇవ్వలేదు. తర్వాత సంవత్సరం ప్రభుత్వమే పిక్కలను కొంటుందని, 80 కేజీల బస్తాకా?, క్వింటాకా ధర నిర్ణయంలో ఉందంటూ మంత్రి అప్పలరాజు ఆ ఏడాది ఊరించారు. ఇప్పటివరకు ఆ డబ్బులూ ఇవ్వలేదు. ఇప్పుడు మళ్లీ ఏమీ తెలియనట్లు ఈనెల 19న మరోసారి వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించిన మంత్రి అప్పలరాజు రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే బస్తాకు రూ.9 వేలు ఇచ్చేయండంటూ వ్యాపారులను ఆదేశించి సమావేశం ముగించారు. జీడిపిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.9 వేలకు కొనాలంటూ వ్యాపారులకు ఉచిత సలహా ఇచ్చారు. జీడిపంట చేతికొస్తున్న మార్చిలోనే వ్యాపారులు రూ.10 వేల వరకు చెల్లించారు. బస్తాకు రూ.వెయ్యి తగ్గించి రూ.9 వేలకు కొనుగోలు చేయమనడంపై రైతులు మండిపడుతున్నారు. పైగా వ్యాపారులకు మేలు చేసేలా కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ఇప్పటివరకు రైతుల నుంచి తూకం వేసి జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులకు ఇక ఆ శ్రమ అవసరం లేకుండా చేసేందుకు ప్రభుత్వమే వారికి రైతుభరోసా కేంద్రాల ద్వారా పిక్కలను కొని వ్యాపారులకు ఇస్తామని చెప్తున్నారు. రైతులకు మేలు చేయాల్సిన మంత్రి వ్యాపారులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి

జీడిపిక్కలకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే డిమాండ్లతో కాశీబుగ్గ సంతమైదానంలో 24 గంటల సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నామని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుసంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ప్రారంభించనున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



జలుమూరు : కూర్మనాథపురంలో వంశధార 3 ఆర్ కాలువకు పడిన గండి

వర్ష ఉద్ధృతి

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- కోతకు గురైన రోడ్లు
- సాధారణ స్థితిలో నదీ ప్రవాహాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, జలుమూరు, లావేరు, పొందూరు, ఆమదాలవలస

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలను వర్షపునీరు ముంచెత్తడంతో చెరువులను తలపిస్తున్నాయి. వరద ఉధృతికి పలుచోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. రహదారులు కోతకు గురయ్యాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగాయి. ఒడిశాలో పెద్దగా వర్షాలు కురవకపోవడంతో వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదులు సాధారణ స్థితిలోనే ప్రవహిస్తున్నాయి.

జలుమూరు మండలం కూర్మనాథపురం సమీపంలోని 3 ఆర్ కుడి కాలువకు గండి పడింది. దీంతో కూర్మనాథపురం, రామయ్యవలస, తాళ్లవలస, గుగ్గిలి, గుండువలస, పాగోడు, కరవంజ తదితర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలు ముంపునకు గురైంది. పాగోడు సమీపంలోని 11 ఆర్ కాలువ నుంచి నీరు రోడ్డు పైకి చేరింది. కొమనాపల్లి, శ్రీముఖలింగం, మర్రివలస, అచ్యుతాపురం, నగరికటకం, కత్తిరివానిపేట, సురవరం, దంపాకు, తిమడాం, సైరిగాం, అల్లాడ, అంధవరం, పర్లాం, మాకివలస తదితర గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలు నీటి మునిగాయి. పొందూరు మండలంలోని నారాయణపురం కుడికాలువ, రెల్లిగెడ్డ ఆయుకట్ట పొలాల్లో వరి పంట నీటి మునిగింది. చిలకపాలెం-పొందూరు రహదారిలోని మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారి వెంబడి గల కాలువలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవడంతో వరదనీరు పోయే మార్గం లేకపోవడంతో నీటమునిగాయి. ఆమదాలవలస మండలంలోని దూసి, కొత్తవలస వద్ద పంట పొలాలు నీటమునిగాయి. చీమలవలస వద్ద నారాయణపురం ఎడమ కాలువ కట్టలు తెంచుకొని ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల పంట పొలాలు నీట మునిగాయి. కొర్లకోట సాగరం చెరువు సమీపంలోని పొలాలు నీట మునగడంతో నదిని తలపిస్తున్నాయి. మండలంలో 300 ఎకరాల వరకు పంట పొలాలు నీట మునిగాయి. కొర్లకోట, రావికంటిపేట, చీమలవలస, వంజంగి, దూసి, కనుగులవలస, ఆనందపురం తదితర గ్రామాల్లో పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది.

తాడివలసలో పెచ్చులూడిన స్కూల్ శ్లాబ్

పొందూరు మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్న పాఠశాలలోని తరగతి గదులు కారిపోయి నీరు చేరడంతో పాటు 9వ తరగతి గదిలో శ్లాబ్ పెచ్చులూడి బెంచీలపై పడ్డాయి. ఈనెల 26న రాత్రి జరగడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కోతకు గురైన రోడ్లు

లావేరు మండలంలో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు కోతకు గురవడంతో విద్యుత్ స్తంభాలు పక్కకు వాలాయి. కొత్తరోతుపేట వద్ద చిట్టగెడ్డ వరద ఉధృతిలో ఒక యువకుడు మోటార్ సైకిల్‌పై రాత్రి పది గంటల సమయంలో వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో చిక్కుకోగా గ్రామస్తులు అతన్ని రక్షించి, మోటారు సైకిల్‌ను తాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చారు. పెదరవుపల్లిలో విద్యుత్ స్తంభం విరిగింది. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దాబాల చెరువు ఉధృతికి చిన్నమురపాక, చిన్నరొంపివలస రహదారి కొట్టుకుపోయింది. వరద ప్రవాహంతో బెజ్జిపురం నుంచి కలిశెట్టిగూడం మార్గం గండి పడింది. మురపాకలో దుక్క భద్రయ్య పక్కా ఇళ్లు ముందు భాగం కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబీకులు మరో గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది. మరో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

సాధారణ స్థితిలో నదీ ప్రవాహాలు

జిల్లాలో గురువారం అక్కడక్కడా చిరుజల్లులు తప్ప పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. ఎల్ఎన్‌పేట మండల కేంద్రం, కోవిలం ప్రాంతాల్లో గరిష్టంగా 1.75 మి.మీ వర్షం పడింది. ఒడిశాలో పెద్దగా వర్షాలు కురకపోవడంతో వంశధారలో నీటి ప్రవాహం తగ్గింది. నదిలోకి 7,678 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అంతే పరిమాణంలో కిందికి వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువలను మూసివేశారు. నారాయణపురం వద్ద నాగావళి నీటి ప్రవాహం 4,300 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. మహేంద్రతనయలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. నదిలో ప్రస్తుతం 350 కూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. వరద ఉధృతి తగ్గడంతో పాతపట్నం మండల కేంద్రంలో కె.గోపాలపురం, ఎస్.గోపాలపురం మధ్య కాజ్‌వే రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి.



లావేరు : కోతకు గురై గుంతలైన బెజ్జిపురం-కలిశెట్టిగూడం రోడ్డు



ఆమదాలవలస : కొత్తవలస వద్ద నీట మునిగిన పంట పొలాలు

పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులు పండించిన అన్ని పంటలకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధమైన కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. నగరంలోని క్రాంతి భవన్‌లో కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, రైతు సంఘం జిల్లా నాయకులు బలగ శ్రీరామ్మూర్తి, కౌలురైతు సంఘం నాయకులు పోలాకి ప్రసాదరావు, ఎఐకెకెఎంఎస్ నాయకులు సురేష్ కుమార్ మాట్లాడుతూ రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను, విద్యుత్ బిల్లు-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలన్నింటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేయాలని, 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర నిర్ణయించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా 500కు పైగా రైతుసంఘాలతో ఏర్పడ్డ సంయుక్త కిసాన్ మోర్చా నేతృత్వంలో రెండో దశ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏడాదికి పైగా సాగించిన పోరాటంతో ప్రధాని నరేంద్ర మోడీ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తానని, రైతులతో చర్చించిన తర్వాతే ఎలక్ట్రిసిటీ బిల్లును ప్రవేశపెడతామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు హామీలను అమలు చేయకపోగా, పార్లమెంటులో విద్యుత్ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. రైతాంగం మెడలకు ఉరితాడు కాగల ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల బిగింపును వేగవంతం చేస్తున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా రైతాంగ డిమాండ్లను సాధించుకునేందుకు తిరిగి పోరాటం కొనసాగించాలన్నారు. కేరళ తరహా రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. ఈనెల 30న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.చందర్రావు, జి.శ్రీరామ్మూర్తి, టి.నందోడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని షలంత్రిలో సుమారు రూ.21.31 లక్షలతో, సుమారు రూ.40 లక్షలతో సచివాలయాన్ని, సరుబుజ్జిలిలో సుమారు రూ.22.40 లక్షలతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సిఎం జగన్ పాలిస్తున్నారని కొనియాడారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా అవినీతి రహిత పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర మల్లేశ్వరరావు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ రవికాంత్, బిసి సెల్ డైరెక్టర్ ఎం.రమణ, మండల మహిళా అధ్యక్షులు బొడ్డేపల్లి చామంతమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తీరానికి కొట్టుకొచ్చిన నీలి తిమింగలం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని పాత మేఘవరం, డి.మరువాడ మధ్యన సముద్రతీరానికి భారీ నీలి తిమంగలం (బ్లూ వేల్) గురువారం కొట్టుకొచ్చింది. సుమారు 25 అడుగుల పొడవుతో ఐదు టన్నుల బరువు ఉంది. భారీ తిమింగళం ఒడ్డుకు కొట్టుకొచ్చిందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సమీప ప్రాంతాల ప్రజలు చూడడానికి తరలివచ్చారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

టిటిడి అటవీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం టిటిడి అటవీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. వెయ్యి రోజులుగా దీక్షలు చేస్తూ పోరాడుతున్న టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా ఎచ్చెర్ల మండల కేంద్రంలో, శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద సిఐటియు ఆధ్వర్యాన గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో వెయ్యి రోజుల పాటు నిరంతరాయంగా పోరాడిన కార్మిక పోరాటం లేదన్నారు. టిటిడి అటవీ కార్మికులు 200 మంది మూడేళ్లుగా అనేక ఒడిదుడుకులు, ఆటంకాలు, వరదలు, వర్షాలను కరోనా వంటి విషమ పరిస్థితులను సైతం ఎదుర్కొని ఈ నిరసన కార్యక్రమం కార్మికులు సాగిస్తున్నారని తెలిపారు. టిటిడి యాజమాన్యం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కోర్టులు ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. టిటిడిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ 24 గంటల్లో రెగ్యులరైజ్ చేస్తానని సిఎం జగన్ హామీనిచ్చారని గుర్తుచేశారు. 2019లో స్వయంగా టిటిడి బోర్డు అటవీ కార్మికులందరికీ టైం స్కేల్ ఇస్తున్నామని తీర్మానం చేసిందని, నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. టిటిడి అటవీ విభాగంలో మొత్తం 362 మంది కార్మికులు పనిచేస్తుంటే, ఇందులో 162 మందిని పర్మినెంట్ చేసి మిగిలిన 200 మంది కార్మికులకు టైమ్ స్కేల్ కూడా ఇవ్వకుండా కార్పొరేషన్‌లో ఏకపక్షంగా కలిపేశారని విమర్శించారు. టిటిడి కార్మికులు ఒంటరిగా లేరని, కార్మికవర్గం యావత్తు వారి పోరాటానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.గోవర్ధనరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, కె.కృష్ణవేణి, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

29న మహిళా పోరుయాత్ర

జయప్రదం చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహిళలపై జరిగే హింసను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని తదితర డిమాండ్లతో మహిళా పోరు (బస్సు) యాత్రను ఈనెల 29న జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి తెలిపారు. పోరుయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని చల్లావీధి కమ్యూనిటీ హాల్ వద్ద పోరుయాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ధ్వజమెత్తారు. మహిళలపై ఎన్నో దాడులు జరుగుతున్నా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు యువత జీవితాలు నాశనమవుతుంటే, మత్తు పదార్థాల మాఫియాలకు ప్రభుత్వాలే అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. మహిళలపై హింసను అరికట్టే దిశగా నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కమిటీ వేయాలని, మద్యం మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించే సభకు యువకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, విమల, సరోజని, లక్ష్మి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పలాస, టెక్కలి రూరల్

అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. పలాసలో సబ్ స్టేషన్ వద్ద, టెక్కలిలో విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజన్ విద్యుత్ జెఎసి నాయకులు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిఆర్‌సి అమలు చేయకుంటే నిరవధిక సమ్మెకు వెనకాడబోమని హెచ్చరించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సిబ్బంది ఎవరైనా మరణిస్తే వెంటనే కారుణ్య నియమకాలు చేపట్టాలన్నారు. ఎరియర్స్ బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్ డిఎలను తక్షణం చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిరంతరం వెలుగులు అందిస్తున్న విద్యుత్ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం అలసత్వం వహించడం తగదన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎన్.లోకేశ్వరరావు, డి.శేఖర్, సురేష్ కుమార్, ఇఇ ప్రసాదరావు, డిఇఇ కృష్ణమూర్తి, ఎఇఇ భాస్కరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు జి.రాజారావు, కె.గిరి, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.



పలాస విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విదేశీ విద్యా దీవెనతో బాసట

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేదరికం కారణంగా చదువుకోలేని విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం బాసటగా నిలుస్తుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. విదేశీ విద్యా దీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకంలో భాగంగా జిల్లాలో ఐదుగురికి రూ.67.80 లక్షలు జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

అర్హతే ప్రామాణికం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ
అర్హతే ప్రామాణికంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటవాడలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ సోడా ఆనందరావు, ఎంపిటిసి జి.సుధాకర్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ప్రకాశరావు

'నాడు-నేడు' పనులు పరిశీలన

సరుబుజ్జిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలిలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఇంటర్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కోట ప్రకాశరావు గురువారం పరిశీలించారు. నాడు-నేడు పనుల్లో పురోగతి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణ్‌రావుకు సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం, మైనర్, మేజర్ మరమ్మతులు పనులు వేగవంతంగా పూర్తి చేశారని ప్రిన్సిపాల్‌ను అభినందించారు. పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కారణంగా మొదటి సంవత్సరం అడ్మిషన్లు 30 శాతం పెరిగాయని ప్రిన్సిపాల్ డివిఇఒకి తెలిపారు. అనంతరం కళాశాల రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట అధ్యాపకులు రామకృష్ణ, నాగేంద్ర, రామారావు, కృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, రమేష్ సాహు, వినోద్ రాజు, శ్రీనివాసరావు విజయ సంగీత, ఆఫీస్ సిబ్బంది కమలాకర్, ఢిల్లీరావు, మణి పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- అదనపు బాధ్యతలతో ఒత్తిడిలో ఉద్యోగులు
- కుంటుపడుతున్న ప్రభుత్వ సేవలు


ఎంపిడిఒ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎఒ కుర్చీ

ప్రజాశక్తి- కవిటి
మండలంలో రెవెన్యూ, మండల పరిషత్ విభాగాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో ఆర్ఐ, ఆరుగురు విఆర్ఒలు, తొమ్మిది సర్వే సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ముఖ్యమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీని ప్రభావం రీ సర్వేపై తీవ్రంగా చూపిస్తోంది. మరోవైపు మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ పోస్టు ఖాళీగా ఉండగా, టైపిస్టు, సీనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌లో ఉన్నారు. అంతేకాకుండా నలుగురు ఉండాల్సిన ఆఫీస్ సబార్డినేటర్లకి ఇద్దరు మాత్రమే ఉన్నారు. అందులో ఒకరు ఇచ్ఛాపురంలో డిప్యూటేషన్‌లో ఉండడంతో మండల పరిషత్ కార్యాలయంలో కేవలం ఒకేఒక సబార్డినేటర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో అటు అధికారుల నుంచి ఇటు ఆఫీసు అబార్డినేటర్ల వరకు సిబ్బంది కొరతతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.

సచివాలయాలదీ అదే తీరు

మరోపక్క ముఖ్యమంత్రి మానసపుత్రిక సచివాలయాలదీ అదే పరిస్థితి. మండలంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఏడుగురుకి ఐదుగురే పనిచేస్తుండగా, రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు నాలుగు, ఎఎన్ఎం-11, మహిళా పోలీస్-3, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆరు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఐదు, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు 12, ఉద్యానవన, వ్యవసాయశాఖ సహాయకులు 11 ఖాళీగా ఉన్నాయి.


ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ కుర్చీ


ఒత్తిడిలో సిబ్బంది

దీంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యతలు తప్పడం లేదు. కొంతమంది ఉద్యోగులు ఏకకంగా నాలుగైదు పంచాయతీల్లో అదనపు బాధ్యతలు చూస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇవన్నీ కలగలసి రోజువారీ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా కొన్నేళ్ల తరువాత చేపడుతున్న రీ సర్వే, ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలు, నాడు - నేడు పనులపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా?

తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్‌లో పెచ్చులూడుతున్న శ్లాబ్

ప్రజాశక్తి- పొందూరు
ప్రమాదకరంగా తరగతి గదులు ఉన్నాయని, వర్షానికి కారిపోతున్నాయని, పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులకు గాయాలు అవుతున్నాయని విద్యాశాఖ అధికారులు పట్టించుకోవాలని ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడని, చివరకు ప్రమాదం జరిగితేనే అధికారులు పట్టించుకుంటారా? అంటూ మండలంలోని తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలలోని తరగతి గదులు కారిపోయి నీరు చేరింది. దీంతో 9వ తరగతి గదిలో శ్లాబ్ పెచ్చులూడి బెంచీలపై పడ్డాయి. ఇది బుధవారం రాత్రి జరగడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదుల్లోనే పాఠాలను బోధిస్తున్నారు. ఇప్పుడు ఆ తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో పలుమార్లు పెచ్చులూడి పడడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లాస్థాయి ఇంజినీర్లు వచ్చి పరిశీలిచారు. విద్యార్థులు కూర్చొనేందుకు అనుకూలంగా లేవని వెంటనే ఖాళీ చేయాలని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటికే పాఠశాలలో సుమారు రెండేళ్ల క్రితం నూతనంగా నాలుగు తరగతి గదులు నిర్మించారు. వాటిని ప్రారంభించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎక్కడ కూర్చోవాలో, ఎక్కడ పాఠాలు బోధించాలో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు సతమతమవుతున్నారు. పెచ్చులూడి పడుతుండడంతో పాఠశాల ఆవరణలో ఉన్న రేకుల షెడ్డులలో పాఠాలను బోధిస్తున్నారు. ఇప్పటినా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే పాఠశాలలో భవిష్యత్‌లో జరిగే ప్రమాదాలకు మమ్మల్ని నిందించవద్దు అంటూ వారంతా కోరుతున్నారు.


బెంచీలపై పడిన శ్లాబ్ పెచ్చులు

జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పని

డ్వామా పీడి చిట్టిరాజు

లావేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పని కల్పిస్తామని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని జి.జి.వలస, కేశవరాయపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. అనంతరం కూలిలతో మాట్లాడారు. జె.జె.వలసలో పలువురు కూలీలు మాట్లాడుతూ కొండపై పట్టాలు ఇచ్చారని, ఆ భూములు చదును చేసుకోవడానికి వీలులేకపోవడంతో ఆ భూములను కాలిగా వదిలేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో పనులు కల్పిస్తే తమ భూములు చదును చేసుకోవాడానికి వీలుంటుందని గిరిజనులు కోరారు. దీనిపై పీడీ స్పందిస్తూ... కొండపై పట్టాలు ఉన్న ప్రతి రైతుకూ పనులు కల్పిస్తామని హామీనిచ్చారు. కొండ ప్రాంతం చదును చేసుకోవడానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎపిఒ ఆర్.సత్యవతికి ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ రూ.272 కూలి వచ్చే విధంగా పనులు చేపట్టాలని అన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

టిడిపి వినూత్న నిరసన

ప్రజాశక్తి- పలాస
మండలంలోని వీరభద్రాపురం తారు రోడ్డు గోతులతో నీరు నిండిపోయింది. వైసిపి ప్రభుత్వం తీరును నిరసిస్తూ రోడ్లపై ఏర్పడిన గోతుల్లో గురువారం వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ నాయుడు మాట్లాడుతూ నాలుగేళ్లుగా తారు రోడ్డు పాడై గోతులతో నిండిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇలాయితే ఏలా ప్రయాణం చేయాలని ప్రశ్నించారు. కనీసం గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని అధికారులను విన్నవించారు. కార్యక్రమంలో కొర్ల విష్ణు చౌదరి, అవుగాన దశరథ పాల్గొన్నారు.


గోతిలో నాట్లు వేస్తున్న టిడిపి నాయకులు


నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

రోడ్డా! చేపల చెరువా?

ప్రజాశక్తి- బూర్జ
మండలంలోని కొల్లివలస మెయిన్ రోడ్లు చెరువులుగా మారాయని జనసేన నాయకులు, ఎంపిటిసి విక్రమ్ విమర్శించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లివలస కూడలిలో ఉన్న గోతిలో ముడుకుల వరకూ నీరు చేరింది. దీంతో జనసేన నాయకులు ఊదులు పట్టుకుని చేపలు పడుతూ గురువారం వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదని విమర్శించారు. కనీసం రోడ్లు కూడా మరమ్మతులు చేసుకోలేని ఈ ప్రభుత్వం, స్థానిక నాయకులు సిగ్గుపడాలని అన్నారు. 15 రోజుల్లోగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే... ప్రజా విరాళాలు సేకరించి మరమ్మతులు చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తకోట నాగేంద్ర, కమిటీ మెంబర్ కోరుకొండ మల్లేశ్వరావు, కొల్ల జయరాం, సేపేన రమేష్, పొట్నూరు ప్రసాద్, మీసాల జోగినాయుడు, టంకాల రమేష్, గణబాబు, గేదెల వినోద్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన అవమానకరం


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం
మణిపూర్‌లో మహిళలను నగ్నంగా తిప్పడం సభ్య సమాజానికి అవమానకరమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిరషోర్‌కుమార్ అన్నారు. మణిపూర్‌లో మహిళలపై దారుణ ఘటనలు, మారణకాండను నిరసిస్తూ నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి వరకూ గురువారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఇది రెండు జాతుల మధ్య చిచ్చుపెట్టి అక్కడ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమకేమి తెలియదన్నట్లు నిమ్మకునీరెత్తినట్లు మౌనంగా ఉన్నారని అన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమేనని అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి తార్కాణమన్నారు, ఉద్దేశపూర్వంగ ప్రజలను రెచ్చగొట్టి అమానవీయ చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ ఆటవిక వికృత చేష్టలను ఆపాలని, లేకుంటే స్త్రీ మూర్తుల కన్నీటి కడలిలో కొట్టుకపోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సంఘీ భావంగా జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.తేజస్వి, పోస్టల్ అసోసియేషన్ నాయకులు గణపతిరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్‌కుమార్, బి.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

హెచ్ఐవి నివేదికలపై ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న హెచ్ఐవి రోగ నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదికలను క్రమం తప్పకుండా ఆన్‌లైన్ ద్వారా సోచ్ పోర్టల్‌కు పంపించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నివేదికల తయారీ, సమర్పణపై సమగ్ర అవగాహనకు వీలుగా గురువారం ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ కామేశ్వరప్రసాద్, రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ హెచ్ఐవికి సంబంధించిన కేసులు కేవలం స్క్రీనింగ్ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నామని, నిర్ధారణ పరీక్షలు దగ్గరలోని స్టాండ్ అలోన్ ఐసిటిసిలో నిర్వహించాలని అన్నారు. స్కానింగ్‌లో పాజిటివ్ వచ్చిన వారిని దగ్గరలోని ఐసిటిసికి వెళ్లే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఒత్తిడి తీసుకురావాలన్నారు. కుష్టు, ఎయిడ్స్, క్షయనివారణ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.అనూరాధ మాట్లాడుతూ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సకాలంలో నివేదికలను రావడం లేదని, దీనివల్ల రోగులకు సకాలంలో మందులు ఇచ్చేందుకు, ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. అందువల్ల ల్యాబ్‌టెక్నీషియన్లు క్రమం తప్పకుండా నివేదికలను సకాలంలో పంపించాలని సూచించారు. సమవేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టరు భాస్కరరావు, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మహంతి వెంకటేశ్వరరావు, డబ్ల్యుహెచ్ఒ కన్సల్టెంట్ సుకుమార్, డిపిఎంఒ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై డిఎంఒ ఆగ్రహం

బూర్జ: డెంగీ వ్యాధి విజృంభించడానికి ప్రధాన కారణం అపరిశుధ్యమే అని జిల్లా మలేరియా అధికారి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని మదనాపురంలో గ్రామాన్ని గురువారం సందర్శించారు. ముందుగా డెంగీతో బాధపడుతున్న వి.పాపమ్మ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఆయన వైద్య సిబ్బందితో కలియ తిరిగారు. తాగునీటి బోర్లు, బావులు, చెత్త కుండీల వద్ద బ్లీచింగ్ వేసి పరిశుభ్రం చేయించారు. గ్రామంలో ఏ మాత్రం కూడా పారిశుధ్యం లేదని, ఎక్కడపడితే అక్కడే అపారిశుధ్యం తాండవిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే గ్రామాలకు కొనసాగితే భవిష్యత్‌లో వ్యాధులు సంభవిస్తాయని అన్నారు. పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్‌బాబు పనితీరుపై ధ్వజమెత్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడ బోసిన నీటిని మాత్రమే తాగాలని, వేడివేడిగా ఉన్న తాజా పదార్థాలు మాత్రమే భుజించాలని, భోజనం చేసే ముందు చేతులు సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. చిన్నజ్వరం వచ్చినా అందుబాటులో ఉన్న ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లను సంప్రదించాలన్నారు. ఈయన వెంట జిల్లా సబ్ యూనిట్ అధికారి సూర్యం, సిహెచ్.అప్పలస్వామి, సూపర్‌వైజర్ తేజారావు, ఎంఎల్‌హెచ్‌పిఒ కావ్యశ్రీ, ఎఎన్ఎం ఆదిలక్ష్మి ఉన్నారు.


పరిశీలిస్తున్న శ్రీకాంత్

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ఈ నెల 28న కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న సత్యాగ్రహ దీక్ష విజయవంతం చేయాలని ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని డోకులపాడు, చిన్నడోకులపాడు, చిన్నవంక పల్లిసారథి, బైపల్లి, అక్కుపల్లి, ఎం.గడూరు గ్రామాలను రైతు సంఘం నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబటి రామకృష్ణ, ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని భాస్కరరావు, కె.బాలాజీరావు, సాతుపల్లి కాంతారావు, కారి పురుషోత్తం, వాడబలిజి సంఘం నాయకులు మడ్డు లక్ష్మీనారాయణ, సౌర లక్ష్మీనారాయణ, దున్న కృష్ణారావు, డొక్కా చంద్రశేఖర్, మడ్డు సత్య మస్టారు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న జీడి రైతు సంఘం నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

టెక్కలి : వర్షాలు కుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి వైద్య సిబ్బందిని సూచించారు. తన ఛాంబరులో డివిజన్ స్థాయి వైద్య అధికారులతో, సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న గుర్తించి తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీతులసి, వైద్యులు గాయత్రి, స్వాతి, 9 మండలాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల రక్షణపై చట్టసభల్లో ప్రశ్నించాలి

కంచిలి: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల గురించి చట్టసభల్లో ప్రశ్నించి, దళితుల రక్షణకు చర్యలు తీసుకునేలా చూడాలని ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి మర్రిపాటి పూర్ణచంద్ర కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని, దళితుల అణచివేతకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళిత మహిళలపై అత్యాచారాలు, ప్రశ్నించే వారిపై భౌతికదాడులు జరుగుతున్నాయని అన్నారు. కానీ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం నుంచి ఒతడి తీసుకువచ్చి రాష్ట్రంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న పూర్ణచంద్ర


మంత్రితో శ్రీనివాసరావు

మంత్రి దృష్టికి నిర్వాసితుల సమస్యలు

కొత్తూరు : వంశధార నిర్వాసితుల సమస్యలను సిఎం వై. ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పల రాజు హామీనిచ్చారని మెట్టూరు బిట్-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద శుద్ధ జల ఉద్దానం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి నిర్వాసి తులు సమస్యలను వివరించారని చెప్పారు. 2019లో సిఎం జగన్ ఇచ్చిన హామీలు గుర్తు చేశారని అన్నారు. కొందరు నిర్వాసితులకే అదనపు పరిహారం అందజేశారని, మిగతా వారికీ పూర్తి స్థాయి పరిహారం చెల్లించాలని కోరానని అన్నారు.

పారిశుధ్య కార్మికుని సేవలకు సెల్యూట్


కాలువలో దిగి పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
నగరంలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల డే అండ్ నైట్ జంక్షన్ వద్ద కాలువ పొంగి పొర్లుతుంది. మురుగు నీరు ప్రవాహానికి అడ్డంగా ఉన్న వ్యర్థాలను తొలగించేందుకు కార్మికుడు శ్రమిస్తున్న తీరు వెలకట్టలేనిది. కార్మికుడి తొలగిస్తున్న చెత్త విధానాన్ని చూపి పలువురు సెల్యూట్ చేశారు. కనీసం వాసన భరించేందుకు సిద్ధంగా లేని మనం.. కాలువల్లో మాత్రం చెత్తాచెదారాలు వీటన్నిటితో నింపేస్తాం. ఇక్కడున్న ఆస్పత్రులు, హోటళ్లు, టిఫెన్ సెంటర్లు, లాడ్జిలు కాలువల్లో చెత్తా చెదారాలను వేసి నింపేస్తున్నారు. తెడతెపిలేకుండా వర్షం కురిస్తే ఎక్కడో ఓ దగ్గర నిల్వ ఉండిపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి వస్తుంది. మురుగునీరు సజావుగా వెళ్లేందుకు పారిశుధ్య కార్మికుడు కాలువలోకి దిగి అడ్డంగా ఉన్న చెత్తా చెదారాలను తీస్తున్నారు.

దత్తత గ్రామాభివృద్ధి ఏదీ?

పలాస : మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దత్తత తీసుకున్న మందస గ్రామాన్ని అభివృద్ధి ఎక్కడ అని జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి వి.దుర్గారావు ఒక ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పలరాజు మందస గ్రామాన్ని దత్తత తీసుకొని ప్రభుత్వం వచ్చిన మొదట సంవత్సర కాలంలోనే ప్రధాన రహదారి, సెంటర్ లైటింగ్ వేస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. మందస నుంచి హరిపురం ఆర్‌అండ్‌బి సింగల్ లైన్ రోడ్డును డబల్ రోడ్డు నిర్మిస్తానని చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మందస రోడ్లతో పాటు బస్సు షెల్టర్ నిర్మించామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని దుయ్యబట్టారు.

రాపాకలో వైద్యసేవలు

ప్రజాశక్తి- పొందూరు
వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యాదికారి ప్రతిభ అన్నారు. మండలంలోని రాపాక హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం-1లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అలాగే నడవలేని మంచం పట్టిన రోగులు ఇళ్ల వద్దకు వెళ్లి చికిత్సను అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, డిఇఒ గోవింద్, ఎఎన్ఎంలు ఉదయ్‌లక్ష్మి, వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాజేశ్వరి, ఉష పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రతిభ

పారదర్శకంగా ఓటరు సర్వే

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో 2,342 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటి పరిధిలో బూత్‌స్థాయి బిఎల్ఒలు ఓటరు సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ అన్నారు. కలెక్టరేట్‌లోని రాజకీయ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు సర్వే పారదర్శకంగా జరగాలని అన్నారు. వాలంటీర్లను వెంట తీసుకెళ్లడం వల్ల అపోహలకు దారితీస్తుందని అన్నారు. కొందరు బిఎల్ఒలు ఉద్దేశపూర్వకంగా వాలంటీర్లపై ఆధారపడి పరిశీలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అటువంటి బూత్‌ల్లో విపక్షాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని వివరించారు. షెడ్యూల్ ప్రకారం బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని కోరారు. ఇంటి నంబరు లేకుండా జీరో నంబరుతో ఉన్న వాటిని, ఒకే ఇంటి నంబరుతో ఎక్కువ మొత్తంలో నమోదైన ఓట్లను పరిశీలించి సరి చేయాలని కోరారు.


మాట్లాడుతున్న డిఆర్ఒ మురళీకృష్ణ

31న పిడిఎఫ్ బియ్యం వేలం

పోలాకి : ఈ నెల 31న పౌరసరఫరాల శాఖ నరసన్నపేట గొడౌన్ వద్ద పిడిఎఫ్ బియ్యం వేలం వేస్తున్నట్లు తహశీల్దార్ కె.శ్రీరాములు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గతంలో గాతలలసలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 907 కేజీల బియ్యం సీజ్ చేశారని అన్నారు. దీనిపై బాధితుడు కోర్టును ఆశ్రయించగా పిడిఎఫ్ బియ్యం కావని, అందులో 10 శాతం బియ్యం మాత్రమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 90.7 కేజీల బియ్యం ఉదయం 11 గంటలకు వేలస్తున్నామని అన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొవాలని సూచించారు. ఈయనతో పాటు డిటి పి.శ్రీనివాసరావు ఉన్నారు.


ఇనాం భూములను పరిశీలిస్తున్న శ్రీకాంత్


శ్రీకాంత్ పర్యటన

మెళియాపుట్టి: మండలంలో దుర్బలాపురం, సుందరాడ, మాకనపల్లి గ్రామాల్లో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా దుర్బలాపురం ఇనాం రైతులు తాము కొన్నేళ్లుగా ఇనాం భూములు సాగు చేస్తున్నామని, అయితే తమకి ఇంతవరకు ఎటువంటి భూ హక్కు పత్రాలు లేవని, తమకు పత్రాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సమస్యను ఆయనకు విన్నవించారు. అంతకుముందు గ్రామస్తులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే మాకనాపల్లి, సుందరాడలో పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణేష్ ప్రధాన్, జనపరెడ్డి కన్నబాబు, ధర్మారావు, బోసి రామారావు, ఉర్లన ఋషి, పడాల తారక్, శంకర్ బరోడా, జగదీష్, సంపత్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

మహిళా కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నవ్యశ్రీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా మహంతి నవ్యశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంచిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆంగ్ల భాష అధ్యాపకులుగా పనిచేసిన ఆమో ఉద్యోగోన్నతిపై కల్పిస్తూ... రాజమండ్రి ప్రాంతీయ ఇంటర్ విద్య సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఆదేశాల ప్రకారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపాల్గఆ పనిచేసిన రజనీకుమారిని కంచిలి మండలానికి బదిలీ చేశారు. నవ్యశ్రీకి అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


పరిశీలిస్తున్న ఎంఇఒలు

ఫిజియోథెరపీ పున:ప్రారంభం

పొందూరు: పొందూరు భవిత కేంద్రంలో వికలాంగులకు నిర్వహించే ఫిజియో థెరిఫీ కార్యక్రమం గురువారం పున:ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావులు మాట్లాడుతూ సెరిబ్రల్ పాలసి, బహుల వైకల్యం, అటిజం వైకల్యం, ఇంటలెక్చ్యువల్ డిసబిలిటీకి చెందిన 3 నుంచి 18 ఏళ్ల వికలాంగ పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిజియో థెరిఫి వైద్యులు రమ్య ప్రియంక, సహిత విద్య ఉపాధ్యాయులు కె.దినేష్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నబమ్మిడిలో పేకాట శిబిరంపై గురువారం దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో దాడి చేశామని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న టైమ్‌స్కేల్ సిబ్బంది

టైమ్‌స్కేల్ సిబ్బంది సర్వీసు క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం వృత్తి విద్య అధ్యాపకులు, ల్యాబ్ అసిస్టెంట్ల సర్వీసులను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు. ఈ మేరకు పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను గురువారం ఇంటర్ విద్యలో పనిచేస్తున్న ఒకేషనల్ పార్ట్‌టైం లెక్చరర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 30 ఏళ్ల పైబడి బోధన, బోధనేతర సిబ్బందిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవలు అందిస్తున్నామని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి- కవిటి


వినతిపత్రం అందజేస్తున్న సురేష్, మేఘనాథ్

మండలంలోని నెలవంక పంచాయతీలో పనిచేయకుండానే కొంత మందికి, వలసపోయిన చాలా మంది బ్యాంకు ఖాతాలకు ఉపాధి హామీ కూలి డబ్బులు జమ చేస్తున్నారని, అధికారులు స్పందించి అక్రమాలు గుర్తించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నెలవంకకు చెందిన నీలాపు సురేష్, బిసాయి మేగనాథ్ కోరారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహిను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో కొంతమంది నాయకులు, వారి అనుచరులు జాబు కార్డులు చేయించుకుని ఉపాధి హామీ పనులకు వెళ్లకుండానే వెళ్లినట్టు చూపించుకుంటూ డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే గతంలో జాబుకార్డు ఉండి ప్రస్తుతం వలసపోయిన కొంతమందికీ నేరుగా వారి ఖాతాల్లోకి ఉపాధి హామీ కూలి డబ్బులు జమ చేస్తున్నట్టు వివరించారు. రెండేళ్లుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ ముఖ్య భూమిక పోషిస్తున్నారని, అతని ఆధ్వర్యానే ఉపాధి హామీ డబ్బులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. దీనికి సంబంధించిన సాక్ష్యాలు జతచేసి అధికారులకు పిర్యాదు చేశామని, అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని దుర్వినియోగమైన ప్రభుత్వ ధనాన్ని వసూలు చేయాలని కోరారు.


పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కాలువ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ శ్రీనివాస్ లాడ్జి కూడలి వద్ద చేపడుతున్న కల్వర్టు, మురుగు కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ కాంట్రాక్టరుకు ఆదేశించారు. ఈ మేరకు కల్వర్టు, మురుగు కాలువ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇష్టానుసారంగా నిర్మాణం చేపడితే బిల్లులు చెల్లించడం కుదరదని కాంట్రాక్టరుకు హెచ్చరించారు. డిగ్రీ కాలేజ్ రోడ్డు కాలువ నుంచి వస్తున్న మురుగునీరు శ్రీనివాస్ లాడ్జి జంక్షన్ కాలువలో వచ్చి చేరే విధంగా పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని, త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. అందుకు ప్రజలు, వాహన చోదకులు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ఉన్నారు.


లైన్ షోయింగ్ పద్ధతిలో నాట్లు వేస్తున్న రైతులు

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలో ప్రస్తుతం వర్షాలు బాగా పడడంతో రైతులు ఉత్సాహంతో వరి నాట్లు వేసుకుంటున్నారని, ఇందులో భాగంగా మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపేనపేట, నిమ్మతొర్లివాడ గ్రామాల్లో రైతులు చేత లైన్ షోయింగ్ పద్ధతిలో గురువారం వరి నాట్లు వేయిస్తున్నామని పేర్కొన్నారు. వరి పంటలో నాట్లు వేసినప్పటి నుంచి కోత దశ వరకు సమగ్ర యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. పంటలో జీవామృతం తప్పనిసరిగా వేయాలన్నారు. పంట మొదటి దశ నుంచి రాజీని సూత్రాలను తప్పకుండా పాటించినట్లయితే మంచి దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. లైన్ పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఎటువంటి తెగుళ్లు సోకకుండా ఆరోగ్యమైన పైరు పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానం చేస్తున్న గ్రామస్తులు

పూర్వ ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యాములపేట మండల పరిషత్ ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయులుతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ ఎం.చిన్నవాడు, అర్జునరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు హిమగిరి, మన్మథరావు, అప్పలరాజు, దుర్గారావు, మహాలక్ష్మి, లక్ష్మీకుమారి, విజయ్‌కుమార్‌లకు ప్రతినిధి ముదిలి సంజీవ్ ఆధ్వర్యాన యువకులు పౌర సన్మానం చేశారు. అలాగే పాఠశాల అభివృద్ధిలో భాగంగా సైన్స్ మెటీరియల్ కోసం యువకులు సేకరించిన రూ.20 వేలు విరాళాన్ని హెచ్‌ఎం విశ్వేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగన్నాథరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కూర్మనాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం


జలుమూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున కృష్ణచైతన్య

నందిగాం : నందిగాంలో జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, సర్పంచ్ జడ్యాడ రమణమ్మ అధ్యక్షతన నిర్వహించిన జనగన్న సురక్షలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేవారు. కార్యక్రమంలో ఎంపిటిసి అంబోడీ విష్ణు, స్పెషలాఫీసర్ మురళీకృష్ణ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కింతల ధర్మారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాలక మధుసూదనరావు, మండల అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, ఎంపిడిఒ శివకుమార్, తహశీల్దార్ ఎం.వి.పద్మావతి పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని పారలం, అంధవరం సచివాయాల్లో నిర్వహించిన జనన్న సురక్షలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి వాన గోపి పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, ఎపిఆర్‌డి పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని వల్లభరావుపేట సచివాలయంలో నిర్వహించిన జనగన్న సురక్షలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.ప్రభాకరరావు, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకట్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షులు జి.మానస పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రేయిపాడులో సర్పంచ్ బచ్చాల ధర్మారావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిలి హరినారాయణ, ఎఎంసీ డైరెక్టర్ ధనలక్ష్మి, తిరుపతిరావు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిటి గిరిరాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదపడుతుందని వైస్ ఎంపిపి ఆదినాయుడు అన్నారు. మండలంలోని భరణికోటలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపిటిసి ఎస్.రవికుమార్, సర్పంచ్‌లు ఎస్.నీలమ్మ, ఎస్.రాధమ్మ, రంగారావు, డిటి శంకరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని తిలారు సచివాలయం వద్ద నిర్వహించిన జనగన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు 774 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యరకమంలో సర్పంచ్‌లు గొద్దు హేమలత, తర్ర ప్రమీల, ఎంపిటిసి తర్ర అప్పలనాయుడు, చేనేత సంఘ అధ్యక్షుడు యర్ర అప్పారావు, డిటి ఆర్.మధు పాల్గొన్నారు.

జి.సిగడాం : జి.సిగడం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్షలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానిలు మీసాల వెంకటరమణ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, మండల అధ్యక్షుడు బురాడ వెంకటరమణ, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ కె.నిశ్చల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

పలాస : కాశీబుగ్గ రైల్వే ఎల్‌సి గేటు మరమ్మతుల కారణంగా శుక్రవారం రాత్రి నుంచి ఆగస్టు 1 వరకు మూసి వేస్తున్నట్లు పలాస రైల్వే స్టేషన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే మూసి వేస్తున్నట్లు చెప్పారు. దీన్ని ప్రజలు, వాహన చోదకులు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న సుధాకర్

రైతుభరోసా పేరుతో దగా

శ్రీకాకుళం అర్బన్ : రైతు భరోసా పేరుతో ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రోడ్కెక్కుతున్నారని టిడిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్ ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గడచిన నాలుగేళ్ల పాలనలో రైతులను అన్ని విదాలా కుంగదీశారని విమర్శించారు. రైతులకు యంత్రీకరణ దరి చేరని పరిస్థితి ఉందన్నారు. ధాన్యం సేకరణపై ఆంక్షలు పెట్టి రైతులకు ఇబ్బందుల పాల్జేశారన్నారు. జిల్లాలోని వంశధార, నాగావళి, మహేంద్ర తనయా, మడ్డువలస ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఏళ్ల తరబడి వేచిచూసే పరిస్థితి దాపురించిందన్నారు. సమావేశంలో పి.ఎం.జె.బాబు, భాస్కరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

కొత్తూరు: ఓటరు సర్వే పారదర్శకంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఓటర్లను తొలగిస్తే... ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అనానరు. కుంటిభద్రలో 21, నివగాంలో 12, కురిగాంలో మూడు టిడిపి ఓట్లు తొలగించారని అన్నారు. సర్వేలో వాలంటీర్ల భాగస్వాములు లేకుండా అధికారులు చూడాలని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, పి.మోహనరావు, కోటి, తిరుపతిరావు, సిహెచ్.లోకేష్, ఎం.కృష్ణ, జి.కమలాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు : పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వయో వృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన వారు, మైత్రి సంఘం ప్రతినిధులు, న్యాయ సంబందిత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పదో తరగతి పాసై పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన వారై ఉండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కలర్ ఫొటోలు, విద్యా సంబంధిత ధ్రువపత్రాలతో మండల న్యాయసేవాధికారి సంఘ కార్యాలయం (కోర్టు) పనిచేయు వేళల్లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పారా లీగల్ వాలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి జీతభత్యాలు, పారితోషికాలు, వేతనాలు చెల్లించబడవని తెలిపారు.

టెక్కలి : టెక్కలి సినియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో గ్రామాల్లో స్వచ్ఛందంగా విధులు నిర్వర్తించేందుకు పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వృద్ధులు, విద్యార్థులు అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు రాజకీయేతర పార్టీలకు చెందిన వారు దరకాస్తులు అందజేయవచ్చునని తెలిపారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లో ఉన్న వారు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోగా ఫొటోలు, పదో తరగతి ఉత్తీర్ణత జిరాక్స్ అందజేయాలని కోరారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం


పోలాకి : పర్యటిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- బూర్జ

ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల కారణంగా నాగావళి నీటి మట్టం పెరుగుతుందని, నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమణారావు సూచించారు. మండలంలోని మామిడివలస పంచాయతీ పరిధిలో ఉన్న కాఖండ్యాం నదిని పరిశీలించారు. నది పక్కనే ఉన్న గ్రామాలు నది వైపు వెళ్లకూడదని సూచించారు. విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, పంచాయతీ సిబ్బంది రాత్రి సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. ఏ ఒక్కరికీ ఇటువంటి నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు మండల కేంద్రానికి సమాచారం అందజేయాలని ఆదేశించారు.

పోలాకి: మండలంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిటి పి.శ్రీనివాసరావు సూచించారు. నదీ పరివాహక ప్రాంతాలైన డోల, గోవిందపురం, పల్లిపేట తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. పంట పొలాలు నీటిలో మునిగి ఉన్న స్థితిని గుర్తించారు. ఈయన వెంట విఆర్‌ఒ హేమసుందరరావు ఉన్నారు.

గౌతు శిరీషతో ఎటువంటి విబేధాల్లేవు

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న బాబూరావు

నియోజకవర్గ ఇన్‌ఛార్జి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో తనకు విభేదాలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని, ఆమెతో ఎటువంటి విభేదాలు లేవని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు స్పష్టం చేశారు. తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కిడ్నీ రోగులకు అందుకోవాలని ఉద్దేశంతోనే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటింటికి కుళాయి ద్వారా నీటి సరఫరా, కిడ్నీ ఆస్పత్రి నిర్మాణానికి భూసేకరణ చేశారని అనానరు. తాగునీటి పథకం కోసం రూ.600 కోట్లు, కిడ్నీ ఆస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం నుంచి జీవోలు కూడా విడుదల అయ్యిందని అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గురిటి సూర్యనారాయణ, బద్రి గోపాల్, శ్రీకాంత్, దాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైల్వే ట్రాక్ పొడువునా కోటబొమ్మాళి మండల పరిధిలో నిర్మించిన రైల్వే అండర్ టన్నలు ఎండకాలనికే పరిమితమవుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అండర్ టన్నల్ వంతెనలు నీటితో నిండి పోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగి ప్రాణాంతకంగా మారుతున్నాయి. వంతెనలు నిండి నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని తిలారు, పంతులపేట, వింజాంపాడు, నూకపేట తదితర గ్రామాలు వద్ద ఈ పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మోటార్లు పెట్టి నీటిని బయటకు తోడిస్తున్నారు. నీరు తోడిన తరువాత కూడా పెద్ద ఎత్తున బురద చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


కోటబొమ్మాళి : నీటితో నిండిన రైల్వే అండర్ టన్నల్

ఆమదాలవలస : మండలంలోని కనుగులవలస, పట్టణంలోని బి.ఆర్.నగర్ వద్ద ఉన్నరైల్వే అండర్ టన్నల్‌ల్లో తరచూ నీటితో నిండిపోతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించుకునేందుకు వీలుకాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో గురువారం నాటికీ గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలులేని పరిస్థితి.

పథకాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి తమ్మినేని శారద అన్నారు. మండలంలోని తొగరాంలో ఆమె నివాసంలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం సిబ్బంది మహిళలకు అందిస్తున్న పథకాలపై గురువారం సమీక్షించారు. అర్హులందరికీ అందేటట్లుగా చూడాలని సిబ్బందికి సూచించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ మండలంలో అర్హత గల 934 స్వయం శక్తి సంఘాలకు వైఎస్‌ఆర్ ఆసరా పథకం కింద నిధులను మంజూరు చేసిందని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ మామిడి చంద్రరావు, విఒఎలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ బెల్లుపడ కాలనీ సచివాలయం పరిధి 15వ వార్డు పండాకాలనీలో నివసిస్తున్న గనగల్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె నామినీ అయిన కొడుకు గానగల్ల నవీన్‌కు వైఎస్‌ఆర్ బీమా తరుపున దహన సంస్కరాల నిమిత్తం తక్షణ సహాయం కింద రూ.పది వేలు కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన గురువారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిలక ఈశ్వరి, కౌన్సిలర్ ప్రతినిధులు పిలక విజయ్, నీలాపు ఢిల్లీ, సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ హుస్సేన్, వాలంటీర్ అనిత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

పోలాకి: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లలవలస, డోల, సుసరాం, పిరియాగ్రహారం, దండులక్ష్మీపురం గ్రామాల్లో గురువారం రైతులతో కలిసి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు పర్యవేక్షణ లోపంతో పంట పొలాలు జలమయంగా మారిపోయాయని అన్నారు. ఈ నాలుగేళ్లలో కాలువలు ఆధునికీరించకపోవడంతో ఏటా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పనాయుడు, పార్లమెంటరీ రైతు కార్యదర్శి లూకాలపు రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి సింహాచలం, డోల ప్రసాద్, బేవర సింహాద్రి, లావేటి కృష్ణ పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : సన్మానిస్తున్న శ్రీనివాసరావు

సేవలతోనే గుర్తింపు

వజ్రపుకొత్తూరు: సేవలతోనే వ్యక్తిగత గుర్తింపు లభిస్తుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమిష్టితో విద్యార్థుల ప్రగతికి పాటుపడే ఉపాధ్యాయులను ఎన్నటికీ మరిచిపోలేరని అన్నారు. ఉపాధ్యాయులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ఎంఇఒ-2గా వెళ్లిన ప్రధానోపాధ్యాయులు తలగాన లింగరాజు, బదిలీపై ఉపాధ్యాయులు కె.రాంబాబు, బమ్మిడి నరేంద్రకుమార్, జయంతి, విశ్వప్రసాద్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాకారునికి సన్మానం

రణస్థలం: బ్యాండ్ కళా రంగంలో విశేష సేవలందించిన రణస్థలానికి చెందిన పరిమెళ్ల సత్యనారాయణను సంపత్ వినాయక ఉత్తరాంధ్ర బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం విశాఖపట్నంలో ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యనారాయణ తన ప్రతిభతో ఉత్తరాంధ్రకు బ్యాండ్ కళారంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అలాగే ఎంతో మందికి బ్యాండ్ వాయిద్యంలో శిక్షణ ఇచ్చి కళాకారులను తయారు చేసి ఉత్తరాంధ్రకు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పరిమళ్ల త్రినాథరావు, రాజేష్, రమేష్, ఇప్పర్తి సత్తిరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి : మండలంలోని మణిక్యపురం 11 కెవి ఫీడర్, ఆర్‌డబ్ల్యుఎస్ 11 కెవి ఫీడర్ పరిధిలోని రోడ్డు మార్గంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలు తొలగించడంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఇఇ జి.ప్రసాదరావు తెలిపారు. వీటి పరిధిలోని వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మణిక్యపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.


ప్రచారం చేస్తున్న మహిళలు

చినబాడాంలో 'మహాశక్తి'

ప్రజాశక్తి- పలాస

టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో చినబడాంలో గురువారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లుగా ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అంటూ చెప్పిన గారడీ మాటలకు ఓట్లేసిన ప్రజలను ఇప్పుడు కల్లబొల్లి మాటలతో మరోసారి మాయచేయాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నవీన్, మోహనరావు, అంబటి కృష్ణమూర్తి, టంకాల రవిశంకర్, మహిళా నాయకులు మార్పు శ్రీదేవి, త్రివేణి, తులసి, లావణ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు

నాగేశ్వరరావును కలిసిన 'ఎంజిఆర్'

హిరమండలం : మండలంలోని కొండరాగోలులో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాళ్ల నాగేశ్వరరావు నివాసానికి టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన వెంట ఎల్ఎన్‌పేట మాజీ మండల అధ్యక్షులు వెలమల గోవిందరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, గొట్ట మాజీ సర్పంచ్ చాపల రామారావు, ముగుడ భద్రయ్య, ముకాళ్ల అప్పలస్వామి ఉన్నారు.


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సన్యాసిరావు

అబ్దుల్ కలాంకు నివాళి

బూర్జ : మండలంలో పెద్దపేట ఆర్ష్ సంస్థ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా కలాం విగ్రహానికి ఆర్ష్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పూలమాలలు వేసి మాట్లాడారు. కలాం చెప్పినట్టుగా అపజయాలు తప్పులు కావు... అవి విజయానికి సోపానాలు అని అన్నారు. ఆయన చెప్పిన మాటలను యువతలో మంచి స్ఫూర్తిని, పట్టుదలను ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకరరావు మాట్లాడుతూ కళాం శాస్త్రవేత్తగా పలు సేవలందించి దేశానికి ఆదర్శమూర్తిగా నిలిచిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

ఓంద్రుజోలలో 'పొలంబడి'

కొత్తూరు : మండలంలోని ఓంద్రుజోలలో మండల ఎఒ శ్రీనివాసరావు ఆధ్వర్యాన గురువారం 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి నాట్లు నాటే ముందు చివర్లను తుంచాలన్నారు. దీని వల్ల కాండం తొలచే ముందు గుడ్ల దశలోనే పురుగులు నివరించవచ్చునని పేర్కొన్నారు. చదరపు మీటరు విస్తీర్ణంలో 33 కుదుళ్ల ఉండే విధంగా వరినాట్లు వేసుకోవాలని రైతులకు సూచించారు. తక్కువ వ్యయంతో వ్యవసాయం సాగుచేందుకు ఆధునిక పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బి.సౌజన్య, సుధాకర్, పూర్ణిమ, వసంత్‌లు పాల్గొన్నారు.


నగదు, బియ్యం అందజేస్తున్న అప్పలనాయుడు

అప్పలనాయుడు ఆర్థికసాయం

లావేరు : వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షానికి మురపాకకు చెందిన దుక్క భద్రయ్య ఇంటి గోడ కూలిపోయింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి నాయకులు లుకాలపు అప్పలనాయుడు, జరుగుళ్ల శంకరరావులు బాధితులను పరామర్శించి తమవంతు సహాయంగా నగదు, బియ్యం గురువారం అందజేశారు. ఈ సమస్యను అధికారులు దృష్టికి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి తేనెల సురేసుకుమార్, మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, ఎస్.నాగరాజు, ఎల్.మల్లేష్, పి.గురునాయుడు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

కవిటి: మండలంలోని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వైద్యుడు ఉలాల కోదండరాం మైక్ సెట్ వితరణగా అందించారు. రూ.25 వేలు విలువైన మైక్ సెట్‌ను ప్రధానోపాధ్యాయులు కె.పైడిరాజు, శ్రీనివాస్, రాము, రామారావులకు అందజేశారు.